



రంజాన్ వేళలు
ఇఫ్తార్-శనివారం
సాయంత్రం - 6.31
సహర్-ఆదివారం
ఉదయం - 5.02

# కలర్ ఫుల్!

## సంబురంగా హోలీ వేడుకలు

రంగుల్లో మునిగితేలిన యువత

డీజే, డప్పు చప్పుళ్ల మధ్య కేరింతలు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల పండుగను జరుపుకున్నారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, కొడంగల్,వికారాబాద్ నియోజకవర్గాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. వికారాబాద్ జిల్లాలో యువకులు బైకులపై వీధుల్లో తిరుగుతూ కలర్స్ గుప్పుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ వేడుకల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని జోష్ నింపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలారు. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, కీసర మండలాల పరిధిలో వేడుకలను ప్రశాంతంగా జరుపుకున్నారు.

- (ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి14)





కొడంగల్: హోలీ సంబరాల్లో నాయకులు, చిన్నారులు



కలెక్టరేట్‌లో కాలనీవాసులతో హోలీ ఆడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



మేడ్చల్‌లో హోలీ ఆడుతున్న యువకులు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్‌ది కుట్రపూరిత రాజకీయం

- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల సెషన్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పిలుపుమేరకు శుక్రవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు నిరసనలు తెలిపారు. జిల్లాలోని మున్సిపాల్టీలు, పట్టణ కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డిని ప్రభుత్వం కుట్ర పూరితంగానే సస్పెండ్ చేసిందని ఆరోపించారు.



బహుమతులతో కేపీఆర్ఐటీ క్రీడాకారులు

## ముగిసిన కురుక్షేత్ర క్రీడా పోటీలు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల రెండు నుంచి జరిగిన కురుక్షేత్ర - 2 కే 25 క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 120 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌ప్రేమ్‌కుమార్ ముగింపు కార్యక్రమానికి హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహిస్తే దేశ ప్రతిష్టను పెంచుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.



# భానుడు భగభగ

ఉమ్మడి జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి నెల సగం ముగిసే వరకు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రతకు ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న వేళ ఉక్కపోత అధికంగా ఉండటంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే వచ్చే రెండు నెలల్లో ఉష్ణోగ్రతలు స్థాయి ఇంకెంత ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు

- మేడ్చల్ జిల్లాలో గరిష్ఠంగా 40.9 డిగ్రీలు
- రంగారెడ్డిజిల్లాలో 40.7 డిగ్రీలు
- వికారాబాద్ జిల్లాలో 40.2 డిగ్రీలు
- రాబోయే మూడు రోజులు మరింత ఎండల తీవ్రత
- రాత్రివేళ సైతం పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం సతమతం
- సరూర్‌నగర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత 33.8డిగ్రీలు



నిర్మానుష్యంగా తాండూరులోని విలియమూన్ రోడ్డు

వికారాబాద్/మేడ్చల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రోడ్లమీదకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. శుక్రవారం మూడు జిల్లాల్లో ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని పలు మండలాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో అత్యధికంగా 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాకగా ఘట్‌కేసర్, ఉప్పల్‌లో 40.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైంది. ఇక రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో అత్యధికంగా 40.7 డిగ్రీలు, తలకొండపల్లి చుక్కాపూర్‌తో

మిగతా 7వ పేజీలో...



కొండాపూర్‌లో మరమ్మతులకు నోచుకోక వృథాగా మారిన నీటితొట్టె

## వృథాగా నీటితొట్టె

పెద్దేముల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అసలే ఎండాకాలం.. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు వృథాగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో చెరువులు, కుంటలు సైతం ఎండిపోతున్నాయి. పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామంలో నీటి తొట్టె వృథాగా ఉంది. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు గుర్తించి నీటి తొట్టికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అడ్డదిడ్డంగా
**పార్కింగ్**
కంపెనీల నిర్లక్ష్యం
ప్రమాదాలకు నిలయం
8

అదుపు తప్పి
**ఆర్టీసీ బస్సు బోల్తా**
20 మందికి స్వల్ప గాయాలు
7

# కాగ్నాకు గంగా హారతి



కాగ్నా నది వద్ద మహిళల మంగళ హారతి

పౌర్ణమిని పురస్కరించుకొని కాగ్నా నదిలో గంగా హారతి కార్యక్రమాన్ని మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శుక్రవారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని కోకట్ కాగ్నా నది వంతెన పక్కన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నది ఒడ్డున గంగామాతను ప్రత్యేకంగా పూలు, పసుపు కుంకుమ, అగర్‌బత్తిలతో అలంకరించారు. శివున్ని స్మరిస్తూ పాటలు పాడారు. ప్రత్యేక పూజలతో కాగ్నా నది పులకించిపోయింది. తాండూరు పట్టణం నుంచి మహిళలు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేసి కాగ్నా నదికి హారతి ఇచ్చారు. ప్రతి పౌర్ణమికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ధర్మ జాగారణ సమితి ప్రతినిధులు తెలిపారు.

తాండూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)



కాగ్నా నదికి మహా మంగళహారతి ఇస్తున్న పూజారులు

## బెల్కటూర్‌లో ఎలుగుబంటి సంచారం!

- కుక్కపై దాడి

తాండూరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కుక్కపై ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చింది. ఈ ఘటన తాండూరు మండలం బెల్కటూర్ శివారులోని పాలీషింగ్ యూనిట్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పాలిషింగ్ యూనిట్ యజమాని తరిగోపుల బలరాం తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 3గంటలకు పాలీషింగ్ యూనిట్ సమీపంలో ఎలుగుబంటి పిల్లలతో సంచరిస్తుండగా గమనించిన కుక్కలు మొరుగుతూ ఎగబడటంతో ఎలుగుబండి ఒక కుక్కపై దాడి చేసింది. దీంతో ఆ కుక్క నోటి భాగంపై తీవ్రంగా గాయమైంది. కుక్కల అరుపులు విన్న పాలిషింగ్ యూనిట్లో పనిచేసే కార్మికులు బయటికి వచ్చారు. దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. కార్మికులు వెంటనే పాలీషింగ్ యజమాని బలరాంకు సమాచారం ఇచ్చారు. ఆయన యూనిట్ వద్దకు చేరుకుని అటవీ శాఖ అధికారులకు, ఎస్ఐ విఠల్‌రెడ్డికి తెలిపాడు. తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి ఆదేశాల మేరకు అటవీ బీట్ ఆఫీసర్లు మల్లయ్య, నాగసాయి పరిసరాలను పరిశీలించారు. జంతువు మలవిసర్జన, కాలి ముద్రలను సేకరించారు. అధికారులు కార్మికులు, గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. ఏదైనా అడవి జంతువు తిరిగినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మల్లయ్యఅది ఎలుగుబంటా, హైనానా అని జంతువు మలవిసర్జన ద్వారా గుర్తిస్తామని పేర్కొన్నారు.



గాయపడిన కుక్క

## ఘనంగా రుద్రహోమం

కులకచర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామిఆలయంలో శుక్రవారం రుద్ర హోమాన్ని ఘనంగానిర్వహించారు. ప్రతీనెల పౌర్ణమి రోజు రుద్రహోమం నిర్వహిస్తారు. ఆలయంలో రెండోసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు.


రుద్రహోమంలో భక్తులు



## అసౌకర్యాల నడుమ ఎక్సైజ్ కార్యాలయం

● 23 ఏళ్లుగా సొంత భవనం లేక ఇబ్బందులు ● ప్రతిపాదనలకే పరిమితమైన నూతన భవన నిర్మాణం


అమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

ఆమనగల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం అసౌకర్యాల నడుమ కొనసాగుతోంది. సొంత భవనం లేని కార్యాలయాన్ని ప్రస్తుతం మండల పరిషత్ పాత అతిథి గృహంలో నిర్వహిస్తున్నారు. 23 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కార్యాలయానికి సొంత భవన నిర్మాణం విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు కలిపి 2002లో ఆమనగల్లులో ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సొంత భవనం లేని కార్యాలయాన్ని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ అద్దె భవనంలో దశాబ్దంన్నర కాలం అసౌకర్యాల నడుమ కొనసాగించారు. అద్దె సకాలంలో చెల్లించకపోవడం, ఏదైనా ప్రభుత్వ భవనంలోకి కార్యాలయాన్ని తరలించాలన్న ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఐదేళ్ల క్రితం మండల పరిషత్ పాత కార్యాలయ భవనంలోకి మార్చారు. రెండేళ్ల క్రితం ఆమనగల్లు పట్టణానికి జూనియర్ సివిల్ జడ్జికోర్టు మంజూరైంది. దాంతో ఎక్సైజ్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనం, మండల పరిషత్ పాత సమావేశ భవనాన్ని కోర్టుకు కేటాయించారు. మండల పరిషత్ ఆవరణలోని పాత అతిథిగృహంలోకి కార్యాలయాన్ని మార్చి కొనసాగిస్తున్నారు. రేకుల భవనంలో కార్యాలయ నిర్వహణతో ఇటు అధికారులు, అటు కార్యాలయానికి వచ్చిపోయే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ఆవరణలో పెద్దగా స్థలం కూడా లేకపోవడంతో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాల పార్కింగ్‌కు కూడా ఇబ్బందిగా మారింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి దశాబ్దం క్రితం 11 గుంటల భూమి కేటాయించారు. కాగా, నేటికి భవన నిర్మాణం దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టడం లేదు. భవన నిర్మాణం గూర్చి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నివేదించినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఉన్నతాధికారులు, పాలక ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవన నిర్మాణానికి, ఖాళీగా ఉన్న అధికారులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రభుత్వానికి నివేదించాం



ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి నూతన భవనం నిర్మాణం గురించి ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం భవనం లేని కారణంగా మండల పరిషత్ పాత అతిథి గృహంలో కార్యాలయం కొనసాగిస్తున్నాం. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కేటాయించిన భూమిని స్వాదీన పరిచి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి అభ్యర్థించారు. ఉన్నతాధికారులకు ఈ విషయమై ప్రతిపాదనలు పంపాం.

- బద్యనాథ్ చౌహాన్, ఎక్సైజ్ సీఐ, ఆమనగల్లు


మహా సంప్రోక్షణ పూజల్లో ఎస్‌వీఎల్‌ఎన్ మూర్తి

## గాయత్రీ మహాక్షేత్రంలో మహాసంప్రోక్షణ

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని తూంకుంటలో గల శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు, వాక్‌బ్రహ్మ డాక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో మహాసంప్రోక్షణ పూజలు పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి.డాక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్ మూర్తి, వేదపండితుల మంత్రోచ్చరణలతో మూడురోజుల జరగనున్న మహా సంప్రోక్షణ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. మహాగణపతి, శివపంచాయతన, సుబ్రహ్మణ్య, ఆంజనేయ,రాఘవేంద్రస్వామి, నవగ్రహ పరివృత గాయత్రీ ఆలయ మహా సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్ నాయకుడు నారాయణరెడ్డిపై దాడి

తాండూరురూరల్, మార్చి 14:ని బెల్కటూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు నారాయణరెడ్డిపై అదేగ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గ్రామానికి చెందిన కుమ్మరి రాములు, కుమ్మరి అంజిలప్పలు శుక్రవారం సాయంత్రం మురుగునీటి కాల్వ విషయంలో నారాయణ రెడ్డితో గొడవపడ్డారు. దీంతో మురుగునీటి కాల్వతమ ఇంటిముందు నిర్మించకుండా నారాయణరెడ్డి ఇంటి ముందు నిర్మించుకోవడమేంటని రాములు, అంజిలప్పలు ఆయనపై నాపరాతి ముక్కలతో దాడిచేసినట్లు బాధితుడి కుటుంబీకులు తెలిపారు. బాధితుడు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాడు. అనంతరం దాడిచేసిన వారిపై కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు నారాయణరెడ్డి తెలిపారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, రెండు పీఆర్సీలు ఇవ్వాలని ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం శామీర్‌పేట మండలం హకీంపేట బస్సు డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల సమ్మె సన్నాహక భాగంలో కార్మికులు పెద్దఎత్తున గేటు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి ఆర్టీసీ డ్రైవర్‌లతో నడిపించాలని డిమాండ్ చేశారు. పనిగంటలను తగ్గించాలని, యూనియన్లను ఆర్టీసీలో పునరుద్దరించాలన్నారు. పలురకాల సమస్యలపై 21డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఆర్టీసీ జేఏసీ ఎప్పుడు పిలిస్తే అప్పుడు కార్మికులందరు సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ టీఎంయూ వర్కింగ్ అధ్యక్షుడు కమలాకర్‌గౌడ్, కో కన్వీనర్లు సద్దాల సురేష్, ఎన్ఎంయూ వల్లూరి బాబు, డిపో జేఏసీ నాయకులు బాలరాజ్, గోపు శ్రీనివాస్, రాంచందర్, రమేష్, సుగుణాచారి, రాజేందర్, తదితర ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


హకీంపేట డిపో వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కార్మికులు

## వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు


కల్కిదోనగుట్టపై పల్లకీలో వేణుగోపాలస్వామి


దేవుని పడకల్‌లోని వేంకటేశ్వరాలయంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

తలకొండపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా చక్రతీర్థం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సిద్దాంతి పట్టాభి రామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ధ్వజారోహణం**

తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అర్చకులు నడదూర్ రామాచార్యులు, పరావస్తు గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు రామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివాసం, ధ్వజారోహణం, బేరిపూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కుమ్మరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## వక్ఫ్ బోర్డు బిల్లులో ప్రస్తుత విధానాలను కొనసాగించాలి

**మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీమ్**



బొంరాస్‌పేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లులో ప్రస్తుత విధానాలను కొనసాగించాలని మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహ్మద్ వసీమ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు కొత్త చట్టం తీసుకొచ్చేందుకు పార్లమెంట్‌లో నిర్వహిస్తున్న చర్చను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముస్లిం సంఘాల ఆస్తి, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కొత్త చట్టం హరించే అవకాశం ఉందన్నారు. కొత్త చట్టంతో ముస్లింలకు నష్టాలు, అస్థిరతను కలిగించే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సమాజసేవా సంస్థలు, న్యాయవాద సంఘాలు, స్థానిక నాయకులతో కలిసి ముందుకు వెళ్లేందుకు చర్చలు చేపట్టనున్నట్లు తెలిపారు.


సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

## సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ధారూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోమిన్‌కలాన్ గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10లక్షల విలువైన సీసీరోడ్డు పనులను శుక్రవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఎంపీ కోటా కింద గ్రామంలోని జొన్నల బిచ్చప్ప ఇంటి నుంచి అంజిరెడ్డి ఇంటి వరకు, పార్కు నుంచి తమ్మళి బిచ్చప్ప ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను దిశ కమిటీ సభ్యుడు వి.నందు, నాయకులు పాండుగౌడ్, వివేకనందరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాణిక్యం తదితరులతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు.

### రూ.5లక్షల విలువైన
## విద్యుత్ వైరు చోరీ

యాచారం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు యాచారం పోలీస్‌స్టేషన్ పరిధి గున్‌గల్‌లోని బాలాజీ వెంచర్‌లో రూ.5లక్షల విలువైన విద్యుత్ వైర్‌ను రెండ్రోజుల క్రితం ఎత్తుకెళ్లారు. బాలాజీ వెంచర్‌లో పది స్తంభాలపై ఉన్న వైర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. వెంచర్ యజమాని నోముల కృష్ణగౌడ్ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

## ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌కు సన్మానం


శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రవిశంకర్

వికారాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్‌కుమార్‌ను వికారాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యువనేత జొన్నల రవిశంకర్ సన్మానించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన డాక్టర్ విజయకుమార్‌తో కలిసి శ్రవణ్‌కుమార్ దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానం అర్చకులు గంగాధరస్వామి సహచర అర్చక బృందం వారిద్దరినీ స్వామి వారి వస్త్రాలతో సన్మానించారు. శ్రీశైల భ్రమరాంబదేవి, మల్లికార్జున స్వామి వారి ఫొటో, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం అందించారు.

## వైభవంగా పాంబండ గిరిప్రదక్షిణ

కులకచర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంబండ గిరి ప్రదక్షిణను శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో పాంబండ శివనామస్మరణతో మారుమోగింది. 27వ పాంబండ గిరి ప్రదక్షిణకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.భక్తులకు ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, అర్చకులు పాండు శర్మ శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు టీచర్ నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


పాంబండ గిరి ప్రదక్షిణలో భక్తులు

# భానుడు భగభగ

(ఐదో పేజీ తరువాయి)



పాటు ఇబ్రహీంపట్నం మంగలపల్లిలో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యధికంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మోమిన్‌పేటలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ నెలకు ముందుగానే భానుడు భగభగమండుతుండడంతో మున్ముందు ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి ఎండలు తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ ఏడాది మార్చినెల మొదటి వారం నుంచి ఎండలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇదిలా ఉంటే రాబోయే మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. వచ్చే మూడు రోజులు పాటు కొన్ని చోట్ల రెండు నుంచి మూడు డిగ్రీల ఈ మేరకు ఉష్ణోగ్రతలు పెరగవచ్చని అంచనా వేసింది. ఉదయం 11గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. అనేకచోట్ల ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వేడి గాలులు మొదలయ్యాయి. అలాగే సాయంత్రం తరువాత ఉక్కబోతలతో జనం సతమతమవుతున్నారు. గతం వారం పగలు ఎండ వేసినప్పటికీ రాత్రి వాతావరణం చల్లగానే ఉండేది. కానీ రెండు రోజుల నుంచి రాత్రిపూట కూడా చల్లబడడం లేదు. రాత్రి వేళ కూడా వేడి, ఉక్కబోతలతో జనం అల్లాడుతున్నారు. పలు మండలాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపైగానే ఉంటున్నాయి. సరూర్ నగర్ మండలం చంపాపేటలో 33.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. అలాగే గండిపేట మండలం మణికొండలో అత్యల్ప ఉష్ణోగ్రత 33.4 నమోదైంది. రాత్రి వేళల్లో కూడా వాతావరణం చల్లబడకపోవడంతో ప్రజలు ఉక్కబోతలతో సతమతమవుతున్నారు.




## చిటారు కొమ్మన మిఠాయి పొట్లం

ఒకే చెట్టుకు ఆరు తేనెతుట్టెలు

చందమామ కథల పుస్తకంలో చిటారు కొమ్మన మిఠాయి పొట్లం అనే కథలా కొడంగల్‌లో ఓ ఇంటి ఆవరణలో పెరిగిన రావిచెట్టుకు ఏకంగా ఆరు తేనెతుట్టెలను తేనేటీగలు ఏర్పాటు చేశాయి. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఓ ఇంటి ఆవరణలో పెరిగిన రావిచెట్టుకు ఉన్న తేనెతుట్టెలు శుక్రవారం ఆంధ్రజ్యోతి కంటబడ్డాయి.

కొడంగల్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం



పరిగి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌ల లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ హరికృష్ణ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. మాదారం, పేటమాదారం, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్, న్యామత్‌నగర్, రంగాపూర్, రంగాపూర్‌తండా, సన్‌సిటీ కాలనీ, జయంతినగర్, కేఆర్ఆర్ కాలనీ, ఎస్ఆర్ఐ కాలనీ, మధురానగర్, లక్ష్మీనగర్, ఆర్టీసీకాలని, వేంకటేశ్వర కాలనీల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## అదుపుతప్పి

# ఆర్టీసీ బస్సు బోల్తా

**20 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు**
**పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్‌లో ఘటన**



సయ్యద్‌మల్కాపూర్ శివారులో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

పరిగి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్ శివారులో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన బస్సులో 100 మందికిపైగా ప్రయాణికులు ఉండగా 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి డిపోకు చెందిన టీఎస్ 34 టీఏ 6868 నంబరు గల ప్రైవేట్ బస్సు శుక్రవారం రాత్రి 7.30 గంటలకు పరిగి బస్‌స్టేషన్ నుంచి షాద్‌నగర్ బయలుదేరింది. కండక్టర్ సత్యనారాయణ ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చే క్రమంలో డ్రైవర్ పర్వతాలు బస్సును రోడ్డు దించి సైడ్ నుంచి వెళ్తుండగా ఇటీవల కొత్తగా వేసిన మట్టిలో బస్సు టైర్లు దిగబడి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో వంద మందికిపైగా ప్రయాణికులున్నారు. 93 మందికి కండక్టర్ టికెట్లు ఇచ్చారు. ఇంకా కొంత మంది టిక్కెట్లు తీసుకోని వారు ఉన్నారు. టికెట్లు తీసుకున్న వారిలో 57 మంది మహిళలు, 36 మంది పురుషులు ఉన్నారు. ఈ ప్రమాదంతో స్వల్ప గాయాలైన వారు.. ప్రయాణికులు జ్యోతి, రాములమ్మ, నర్సమ్మ, రాములు, సుజాత, కమలమ్మ, గౌరీనందన్, మంజుల, యాదమ్మ, శ్రీనివాస్, అంజమ్మ, పార్వతమ్మ, రుక్కమ్మ, సుధారాణి, వెంకటయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరినీ అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి చికిత్స అందించి స్వగ్రామాలకు పంపించారు. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొని వెళ్లిపోయారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సోమ్లా, పరిగి సంతోష్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బస్సు బోల్తా ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. బస్సు డ్రైవర్ పర్వతాలు పరారీలో ఉన్నాడు. బస్సులో 58 మంది ప్రయాణికులే ఉండాల్సి ఉండగా ప్రమాదం జరిగిన బస్సులో రెండింతలు ఉంటే వందకుపైగా ఉన్నారని ప్రయాణికులు తెలిపారు. ఓవర్ లోడ్ వల్లనే బస్సు బోల్తా పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ బస్సు బోల్తా జరిగిన తీరు పరిశీలిస్తే పెద్ద ప్రమాదమే అయినా ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.





పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు

### 100కు పైగా ప్రయాణికులున్నారు



ప్రమాదం జరిగిన బస్సులో వంద మందికిపైగా ప్రయాణికులు ఉంటారు. 93 మందికి టిక్కెట్లు ఇచ్చాను, మరికొందరికి ఇవ్వాల్సి ఉంది. బస్సును కాస్త నిదానంగా వెళ్లమని చెప్పాను. రోడ్డు దిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను కిందకు దింపే ప్రయత్నం చేశాం.

- కండక్టర్ సత్యనారాయణ

## బెల్టు షాపుల తనిఖీ.. మద్యం స్వాధీనం

యాచారం/మాడ్గుల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలోనిగూడ గ్రామంలో రాములు అనే వ్యక్తి కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు శుక్రవారం దాడిచేసి రూ.6వేల విలువైన మద్యం పట్టుకున్నామని ఎస్సై మధు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించరాదని సూచించారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని కిరాణ షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం మేరకు మాడ్గుల పోలీసులు తనఖీలు నిర్వహించారు.ఈ మేరకు మాడ్గుల మండల కేంద్రంలోని అంబల్ల యాదయ్య మణికంఠ కిరాణ షాపు లో పోలీసులు తనఖీ చేయగా 13లీటర్ల మద్యం, 50 లీటర్ల బీరు బాటిళ్ల చేసుకోన్నారు.అదే విధంగా జైహనుమాన్ కిరాణషాపులో దాదాపు 5 లీటర్ల విస్కీ, 15 లీటర్ల బీర్లు పట్టుకున్నారు. అనంతరం నాగిళ్ల గ్రామంలో చంద్రశేఖర్ కిరాణ షాపులో 12లీటర్ల విస్కీని స్వాధీనం చేసుకోన్నారు షాపుల యజమానులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. వారివెంట ఎస్ఐ నాగరాజు ఉన్నారు.



తాండూరు మున్సిపాలిటీలో మూలన పడిన యంత్రాలు

## దోమలు బాబోయ్.. దోమలు

తాండూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు మూలకు పడేశారు. కొనుగోలులో చూపించిన ఉత్సాహం వినియోగంలో చూపించడం లేదు. తాండూరు మున్సిపాలిటీలో దోమల నివారణకు రూ.లక్షలు పెట్టి దాదాపు పది 10 ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. ఏడాది క్రితం కమిషనర్ షఫీఉల్లా ఉన్న సమయంలో ఒకటి, రెండు సార్లు ఫాగింగ్ చేయించారు. తర్వాత మిషన్లు పాడయ్యాయని మూలన పడేశారు. తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో ప్రజలు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేక రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, గొల్ల చెరవు, పాత తాండూరు రైల్వే గేటు తదితర ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. భవనీనగర్, సాయిపూర్, ఆదర్శ నగర్‌లో మురుగు కాల్వలు పూడికతో నిండి దోమలకు ఆవాసంగా మారాయి. కనీసం దొమల మందు కూడా పిచికారీ చేయడంలేదని ఆయా కాలనీల ప్రజలు వాపోయారు. దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నామని, దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## జగదీశ్‌రెడ్డి అవినీతిని

# బయట పెడుతాం



వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అవినీతిని త్వరలో బయటపెడతామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సంతోష్ కుమార్, చిగుళ్లపల్లి రమేష్, అనంత్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అనంత్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

**మర్పల్లి:** ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకుంటే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. అసెంబ్లీలో గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా శుక్రవారం మర్పల్లి మండల కేంద్రంలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.



మర్పల్లిలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ధారూరు:** అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి అహంకార పూరితంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ధారూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అశోక్ ముదిరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేపోతుందన్నారు. నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అహంకారపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

**పూడూరు** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సామాజిక న్యాయాన్ని కల్వకుంట్ల కుటుంబం జీర్ణించుకోలేకపోతోందని యూత్ కాంగ్రెస్ పూడూరు మండల అధ్యక్షుడు సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాటలు ఆయన, పార్టీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. స్పీకర్ స్థానంలో గడ్డం ప్రసాద్ కుమార్‌ను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ కక్షగట్టిందని ఆరోపించారు. అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులంతా రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**బంట్వారం:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ బంట్వారం మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నిండు శాసనసభలో స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి చులకనగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, యాదగిరి, పంది వెంకటయ్య, శ్రీనివాస్, రాధాకృష్ణగౌడ్, రాములు, వెంకటేశం, నర్సింహులు, వీరేశం, రమేష్, మహేష్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ధారూరు:** శాసనసభలో స్పీకర్‌ను ఉద్దేశించి అహంకార పూరితంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ధారూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అశోక్ ముదిరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేపోతుందన్నారు. నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అహంకారపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**నవాబుపేట:** అసెంబ్లీలో గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దళిత ముద్దుబిడ్డ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయనను అసెంబ్లీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**యాలాల:** అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ యాలాల మండల మాజీ అధ్యక్షుడు అయ్యగాళ్ల భీమయ్య అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ స్పీకర్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి సభా సంప్రదాయాన్ని మర్చిపోయి మాట్లాడటం సరికాదన్నారు. స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్యేను వెంటనే సభ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# ఇదేం పంచాయతీ

## ప్రత్యేక అధికారుల పాలనకు ఏడాది పూర్తి

- నిధులు లేక విధులకు రాని సార్లు
- అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కొడంగల్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలై ఏడాది ముగుస్తోంది. ఒక్కో పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించాల్సి ఉండగా.. అధికారుల కొరతతో రెండు, మూడు గ్రామాలకో ప్రత్యేకాధికారిని నయమించారు. దీంతో పనిభారం పెరిగి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించింది. పంచాయతీలతో పాటుగా మండల పరిషత్తులకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. సొంత శాఖల్లో పనిభారంతో పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలు, సంతకాలకే పరిమితమవుతుండడంతో పాలన పడకేసింది. నిధుల లేమి, పర్యవేక్షణ లోపం, పాలనా వ్యవహారాలు చూసే వారు లేక ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

### భారమంతా కార్యదర్శిపైనే..

మండలంలో 26 పంచాయతీలు ఉండగా పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడం, నిధుల లేమితో పంచాయతీల నిర్వహణ భారం క్యాదర్శులపై పడుతోంది. పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా, ప్రభుత్వ పథకాల సర్వే, ట్రాక్టర్, ట్యాంకర్ల నిర్వహణ, తాగునీటి పథకాల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీ, వీధి దీపాలు ఇలా పలు రకాల పనుల కోసం సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సరిపడా విడుదల కాకపోవడంతో కష్టంగా మారింది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించక, వారితో పనిచేయించడం కష్టతరంగా మారింది.



ఎరాన్‌పల్లిలో మరమ్మతులకు నిధులు లేక మూలనపడ్డ ట్రాక్టర్

### వేసవిలో గట్టెక్కేనా...

పల్లెలో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. భగీరథ నీరు పల్లెలకు చేరకపోవడంతో స్థానిక వనరులపై ఆధారపడుతున్నారు. తాగునీటి పథకాల్లో నీటి వనరులు లేని గ్రామాల్లో మంచినీటికి కటకట తప్పడం లేదు. ట్యాంకర్లు, అద్దెబోర్లు, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నా పంచాయతీల్లో నిధులు ఉంటేనే సాధ్యపడుతుంది. ప్రత్యేకాధికారుల పాలనలో వేసవి ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రత్యేకాధికారులు గ్రామాలను పట్టించుకొని తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### పల్లెల్లో సమస్యలివీ..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక చిన్న పంచాయతీల్లో గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ల రుణ వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది.
- పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణ కొరవడింది.
- గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్త డబ్బాలు విరిగిపోవడంతో కొత్తవి కొనలేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.
- కొన్ని పంచాయతీల్లో డీజిల్‌కు డబ్బులు వెచ్చించలేక చెత్త ట్రాక్టర్ తిరగకపోవడంతో రహదారులపై చెత్త దర్శనమిస్తోంది.
- కొన్ని గ్రామాల్లో ట్రాక్టర్లకు డీజిల్ కోసం కార్యదర్శులు అప్పులు చేస్తున్నారు.
- వీధి దీపాల మరమ్మతులకు గురైనా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేని పరిస్థితి.
- గ్రామాలకు భగీరథ నీరు చేరక పాత తాగునీటి పథకాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.
- క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పు పడుతున్నా మార్చలేని పరిస్థితి నెలకొంది.


వికారాబాద్: హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్


తాండూరు: చిన్నారులతో హోలీ ఆడుతున్న బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం


తాండూరు: హోలీ వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత సంపత్


మేడ్చల్ ప్రతినిధి: శామీర్‌పేట గ్రామంలో హోలీ సంబురాల్లో యువకులు


తాండూరు రూరల్: అంతారంలో హోలీ ఆడుతున్న చిన్నారులు, యువకులు, పెద్దలు


ధారూరు: ధారూరులో హోలీ ఆడుతున్న గ్రామస్థులు


పరిగి: పట్టణంలోని హోలీ సంబురాల్లో యువకులు


కీసర రూరల్: హోలీ సంబరాల్లో దమ్మాయిగూడ మాజీ సర్పంచ్ పాండాల అనురాధ యాదగిరిగౌడ్ దంపతులు, స్థానికులు

# హోలీ.. రంగుల కేళీ

**● ఆనందోత్సాహాల నడుమ రంగుల పండుగ ● సంప్రదాయబద్ధంగా కామదహనం ● రంగులతో సందడి వాతావరణం**


వికారాబాద్: హోలీ వేడుకల్లో చిన్నారులు

వికారాబాద్/నవాబుపేట/బంట్వారం/ధారూరు/ మోమిన్‌పేట్/మర్పల్లి/కోట్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకలు శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంబరాన్ని తాకాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతీఒక్కరు వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆయా వార్డుల్లో ప్రజలు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితులు, యువకులు పట్టణంలో తిరుగుతూ వేడుకలు జరుపుకోగా, కలెక్టర్ ప్రతీక్ జైన్ కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు జరుపుకున్నారు. స్థానిక చిన్నారులతో కలిసి హోలీ జరుపుకున్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నాయకులతో కలిసి హోలీ ఆడగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా నవాబుపేట, బంట్వారంలో ప్రజాప్రతినిధులు మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ధారూరులో ఉపాధిహామీ కూలీలు పని ప్రదేశంలో హోలీ పండుగ జరుపుకున్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కోట్‌పల్లిమండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### తాండూరులో..

తాండూరు/తాండూరు రూరల్/యాలాల/పెద్దేముల్: తాండూరు పరిధి మర్వాడీ బజారులో మార్వాడీలు హోలీ పండుగను ప్రత్యేకంగా జరుపుకున్నారు. నాగారం కంపౌండ్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో చిన్నారులు మర్రి చెట్టుకు కూడలి వద్ద నెహ్రూగంజ్, మర్రి చెట్టు వివేకానంద యువత హోలీ జరుపుకున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి చిన్నారులతో కలిసి హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. గురువారం రాత్రి 11గంటలకు సాంప్రదాయ బద్ధంగా కామదహనం చేశారు. గ్రామ పెద్దలు పుల్ల వెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, పుల్ల ప్రభాకర్‌రెడ్డి, నల్లా సంపత్ కుమార్, కోస్గి ఆశన్న, యువకులు పాల్గొన్నారు. అంతారంలోపాటు తదితర గ్రామాల్లో రంగుల పండుగ హోలీని సంతోషంగా జరుపుకున్నారు. అదేవిధంగా యాలాల మండలంలో హోలీ పండుగను ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో హోలీ సంబరాలను జరుపుకున్నారు. అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంగెంఖుర్దు హన్మంతు తదితరులు ఆయా గ్రామాల్లో హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న, పెద్ద తేడాలు లేకుండా అందరూ రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. డప్పు వాయిద్యాలతో గ్రామంలో తిరుగుతూ యువకులు చిందులు వేశారు.

### పరిగిలో..

పరిగి/కులకచర్ల/పూడూరు/చౌడాపూర్/దోమ: పరిగి పట్టణంలోని బహార్‌పేట్, టీచర్ కాలనీలో హోలీ సంబరాల్లో భాగంగా గురువారం రాత్రి కామదహనం చేశారు. కాగా శుక్రవారం ఉదయం హోలీ సంబురాల్లో పాల్గొని యువకులు రంగులు జల్లుకున్నారు. అదేవిధంగా కులకచర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకొని ఆలింగనం చేసుకున్నారు. చిన్నారులు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కులకచర్లలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, జానకిరామ్, చంద్రలింగం తదితరులు హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. గురువారం అర్ధరాత్రి వరకు ముజాహిద్‌పూర్ గ్రామంలో కామదహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్. ఆంజనేయులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరు మండలంలోని తిర్మలాపూర్‌తోపాటు వివిధ గ్రామాల్లో ఉదయం నుంచే యువకులు, చిన్నారులు రంగులు జల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చౌడాపూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దోమ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. బొంపల్లి గ్రామంలో యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

### కొడంగల్‌లో..

కొడంగల్/బొంరాస్‌పేట్/దుద్యాల: కొడంగల్ పట్టణంలోని కార్గిల్, శాంతినగర్, ఇంద్రానగర్, బాలాజీనగర్, వడ్డర్ గల్లీ, లాహోటీ కాలనీ, సన్‌సిటీ తదితర కాలనీల్లో గురువారం రాత్రి కామదహనం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే యువకులు, చిన్నారులు రోడ్లపైకి చేరి రంగులు చల్లుకున్నారు. స్థానిక బంజార భవనంలో గిరిజన సంఘం నాయకులు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, రామాంజనేయ, శంకర్‌నాయక్, రాజునాయక్, సేవ్యానాయక్, రవినాయక్, సామ్యానాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. దుద్యాల మండల వ్యాప్తంగా హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ యాదగిరి పోలీసు సిబ్బందితో గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు.

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/కీసర రూరల్/మేడ్చల్ ప్రతినిధి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.శుక్రవారం ఉదయం నుండే యువకులు, చిన్నారులు వీదుల్లో రంగులు చల్లుకోని సంబురాలు జరుపుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని వివిద కాలనీల్లో, అలాగే కొండాపూర్ చందుపట్లగూడ, ఎన్ఎఫ్‌సీనగర్. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, పోచారంలలో హోలీ వేడులకును ఘనంగా నిర్వహించారు. అవుశాపూర్‌లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, నాయకులు అయిలయ్య, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వామన్‌రెడ్డి హోలీ సంబరాలు జరుపుకున్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ ప్రజలు శుక్రవారం హోలీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తూంకుంట మున్సిపాలిటీలో చిన్నారులు, యువకులు, మహిళలు హోలీ పండగను జరుపుకున్నారు.


ఘట్‌కేసర్: రంగులు చల్లుకుంటున్న యువకులు


కొడంగల్ రూరల్: హోలీ సందర్భంగా రంగులు చల్లుకుంటున్న కుటుంబసభ్యులు


మోమిన్‌పేట్: హోలీ సంబురాల్లో యువకులు


దోమ: బొంపల్లిలో హోలీ సంబరాల్లో యువకులు


చౌడాపూర్: మందిపాల్‌లో హోలీ సంబురాలు


కులకచర్లలో హోలీ సంబురాల్లో యువకులు


యాలాల: మండల కేంద్రంలో హోలీ సంబురాల్లో మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ


పూడూరు: తిర్మలాపూర్‌లో జరిగిన హోలీ పండుగలో యువకులు, చిన్నారులు


ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో హోలీ వేడుకల్లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి తదితరులు


పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో రంగులు చల్లుకుంటున్న యువకులు

# నియంతృత్వ పోకడలను మానుకోవాలి


వికారాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఘట్‌కేసర్: అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డిలు అన్నారు. పట్టణంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను అసెంబ్లీలో ప్రశ్నించినందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కోట్‌పల్లి: స్పీకర్ ప్రసాద్ కుమార్ గౌరవానికి భంగం కలిగించే మాటలు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడలేదని కోట్‌పల్లి టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుందర్‌అనిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌పై ఎలాంటి అగౌరపరిచే మాటలు మాట్లాడలేదన్నారు.

ఘట్‌కేసర్: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనని బీఆర్ఎస్ నాయకులు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఆందోళనకు దిగిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింగరావు, రమేష్, రవి, సుధాకర్, ఖలీల్, యాదగిరి, విజయ్, సిరాజ్ పాల్గొన్నారు.

బంట్వారం: స్పీకర్ ప్రసాద్ కుమార్ గౌరవానికి భంగం కలిగించే మాటలు జగదీష్‌రెడ్డి మాట్లాడలేదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గంచెరువు మల్లేశం అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో జరిగిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు పెద్దగా చేయడం సబబు కాదన్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు ఇచ్చిన హామీలపై శ్రద్ధతీసుకోవాలని మహిళలకు 2,500, నిరుద్యోగులకు 3,000 భృతి పూర్తికాని రుణమాఫీ, అసంపూర్తి హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు.

పరిగి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ, బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దాహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.రవికుమార్, ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పరిగి: సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనంచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# అడ్డదిడ్డంగా పార్కింగ్

- కంపెనీ యజమాన్యం నిర్లక్ష్యం
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

పరిగి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పరిగి-షాద్‌నగర్ రహదారిలో లక్ష్మీదేవిపల్లి గేట్ దగ్గర ఉన్న సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ దగ్గర భారీ వాహనాలు నిలపడంతో వాహనదారులకు ఇబ్బందికంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు ఈరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే సుగుణ స్టీల్ కంపెనీ గేటు దగ్గర రోడ్డుపై ఇరువైపులా లోడ్‌తో ఉండే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలను నిలపడం వల్ల ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల్లో గతంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. కంపెనీ యజమాన్యం నిర్లక్ష్యం వల్లే వేలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. రాత్రి సమయంలో అయితే కిలోమీటరు దూరం డ్రైవింగ్ చేయాలంటే ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


సుగుణ ఫ్యాక్టరీ వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉన్న వాహనాలు

**క్రైం కార్నర్**

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గుర్తుతెలియని ఇద్దరు మృతి

ఘట్‌కేసర్ రూరల్/పరిగి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎన్ఎఫ్‌సీ నగర్ వంతెనపై గుర్తుతెలియని వ్యక్తి(35) హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా పరిగి పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదం గురువారం అర్ధరాత్రి జరిగింది. దాదాపుగా 45ఏళ్ల వయస్సు గుర్తుతెలియని వ్యక్తి గురువారం అర్ధరాత్రి రంగంపల్లి వైపు నుంచి పరిగికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాటన్‌మిల్లు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిగి ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులు 8712670041 నంబరును సంప్రదించాలని ఎస్ఐ సంతోష్ తెలిపారు.